## క్లుప్తంగా

### అభయాంజనేయ స్వామి రథోత్సవం



అమినాబాద్‌లో రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

**తుగ్గలి:** హనుమాన్ జయంతి వేడుకలను శుక్రవారం అమినాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. అభయాంజనేయ స్వామి ఆలయంలో గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో స్వామికి ఆకుపూజ, అర్చనలు, అభిషేకాలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం రథోత్సవం వైభవంగా నిర్వహించారు.

### దరఖాస్తుల ఆహ్వానం

**మద్దికెర:** మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధిచెందిన శ్రీరంగనాథస్వామి ఆలయ నూతన పాలకమండలి నియామకానికి ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. దేవదాయ ధర్మదాయ శాఖ ఉప కమిషనర్ ఆదేశాల మేరకు దరఖాస్తులు సంబంధిత కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

### రేషన్ బియ్యం అక్రమ నిల్వ

**మద్దికెర:** మద్దికెర - బొజ్జనాయునిపేట మార్గంలో హంద్రీ నీవా కాలువ వద్ద కొత్తపల్లికి వెళ్లే దారిలో శుక్రవారం 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తు తెలియని వ్యక్తులు నిల్వ ఉంచారు. ఇక్కడెందుకు నిల్వ ఉంచారని రైతులు ప్రశ్నించడంతో వ్యాపారులు బియ్యం వదిలేసి పరారయ్యారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచేందుకు ఈ ప్రాంతం అడ్డాగా మారింది. సంబంధిత అధికారులు పలుమార్లు దాడులు నిర్వహించి బియ్యం స్వాధీనం చేసుకున్నా వ్యాపారుల్లో మార్పు కనిపించడం లేదు. తమ పొలాల వద్ద బియ్యం నిల్వ ఉంచడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఇలాంటి ఘటనలు జరగకుండా కఠిన చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

### క్రికెట్ టోర్నీ విజేత గోరంట్ల



గోరంట్ల జట్టుకు నగదు బహుమతి అందిస్తున్న నిర్వాహకులు

**వెల్దుర్తి:** రామళ్లకోటలో వనం శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నీలో కోడుమూరు మండలం గోరంట్ల జట్టు విన్నర్‌గా నిలిచి రూ.30 వేల నగదు బహుమతి గెలుచుకుంది. రన్నర్‌గా నిలిచిన రామళ్లకోట శివ జట్టు రూ.20 వేలు దక్కించుకున్నట్లు నిర్వాహకులు మధు, రమణ, పార్థుడు, శ్రీనివాసులు, మనోహర్, ఇదుర్‌బాష తెలిపారు. విజేతలకు వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి మాధవస్వామి, నిర్వాహకులు, దాతలు బహుమతులందించారు.

### చలివేంద్రం ప్రారంభం

**గోనెగండ్ల:** స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ హైమవతి శుక్రవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. వేసవిలో ప్రయాణికులు, వ్యాపారుల దాహార్తి తీర్చేలా చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పంచాయతీ సిబ్బంది మలాంగ్, సుభాన్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

### బస్సు సర్వీసును ప్రారంభించిన ఎమ్మెల్యే

**పత్తికొండటౌన్:** ఆర్టీసీ బస్సులలో ప్రయాణం సురక్షితం అని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో పత్తికొండ-కర్నూలు కొత్త బస్సు సర్వీసును ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పూజ చేసి ప్రారంభించారు. అంతకుముందు ఎమ్మెల్యేను డీఎం మహమ్మద్ రఫీక్, సిబ్బంది శాలువా, పూలమాలతో సత్కరించారు.

### భూకబ్జాను నిరూపించండి

**ఎమ్మిగనూరుటౌన్:** పట్టణంలోని వెంకటాపురం కాలనీలో తాను భూకబ్జా చేసినట్లు ఆరోపిస్తున్న టీడీపీ మాజీ కౌన్సిలర్ కోనేరు నాగేంద్రప్రసాద్ ఆధారాలతో నిరూపించాలని వెంకటాపురం 28వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ బజారి శుక్రవారం ఒక ప్రకటనలో సవాల్ విసిరారు. ప్రభుత్వ భూమిని తాను ఖబ్జా చేసినట్లు నిరూపిస్తే పదవికి రాజీనామా చేస్తానని, నిరూపించలేకపోతే నాగేంద్రప్రసాద్ పంచాయితీలు చేసే ఆఫీసును ఖాళీ చేసి ఇంట్లో కూర్చోవాలని సూచించారు.

### శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి కల్యాణోత్సవం

**కృష్ణగిరి:** చిట్యాల గ్రామంలో వెలసిన లక్ష్మీచెన్నకేశవ స్వామి ఉత్సవాలను గ్రామస్తులు ఘనంగా జరుపుకుంటున్నారు. శుక్రవారం స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ఆశేష జనవాహిని మధ్య కల్యాణం నిర్వహించారు. ఏపీ అర్చక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కోటపాడు శ్రీనివాస ఆచార్యులు పాల్గొన్నారు. ఆయన్ను గ్రామస్తులు శాలువాతో సత్కరించారు. సాయంత్రం పల్లకీ సేవ గ్రామ వీధుల గుండా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

# నేతల పర్యటనకు నీరాజనం

- 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమానికి అపూర్వ స్పందన
- సంక్షేమ పథకాల గురించి సంతృప్తి వ్యక్తం చేసిన లబ్ధిదారులు
- జగనన్నను మళ్లీ సీఎంగా గెలిపించుకుంటామని తేల్చిచెప్పిన మహిళలు





ఎమ్మిగనూరు 3వ వార్డులో చేనేత కార్మికురాలి ఇంటికి వెళ్లి మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి, రామళ్లకోటలో ప్రజా సర్వే చేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

**ఎమ్మిగనూరుటౌన్:** అమ్మా ఎలా ఉన్నారు? సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా? మా ప్రభుత్వ పనితీరు ఎలా ఉంది? అని చేనేత కార్మికులను ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి ఆప్యాయంగా పలకరించారు. 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని 3వ వార్డులో ఎమ్మెల్యే చేనేత కార్మికుల ఇళ్లను సందర్శించారు. వార్డు ఇన్‌చార్జ్ వినయ్, సచివాలయ కన్వీనర్ పంపయ్య, గృహసారథులు బందెనావాజ్, పార్వతి, వలంటీర్ అర్జున్‌తో పాటు పార్టీ శ్రేణులతో కలిసి చేనేతల ఇళ్లకు వెళ్లారు. వీధిలో ఉన్న చంద్రమ్మ, పార్వతి, ఆనంద్, నీలకంఠ అనే చేనేత కార్మికుల ఇళ్లకు ఎమ్మెల్యే వెళ్లి ఒక్కో ఇంట్లో 15 నిమిషాలకు పైగా కూర్చొని పథకాల అమలు గురించి ఆరా తీసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు నేరుగా అందుతున్నాయని వారు బదులిచ్చారు. తమ వీధిలో కుక్కల బెడద ఉందని, రోడ్ల ప్యాచ్ వర్క్‌లు చేయాలని చంద్రమ్మ తెలపగా వెంటనే కమిషనర్ గంగిరెడ్డితో ఫోన్‌లో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. నేత పనిలో రోలింగ్‌కు 'నేతన్న నేస్తం' పథకం వర్తించడం లేదని నీలకంఠ అనే కార్మికుడు విన్నవించగా, పథకం వర్తింపజేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చి వారి ఇళ్లకు స్టిక్కర్లను అంటించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు బుట్టారంగయ్య, జిల్లా వక్ఫ్‌బోర్డ్ ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్, జేసీఎస్ పట్టణ కన్వీనర్ బంగిశ్రీరాం, శివప్రసాద్, మన్సూర్‌బాష తదితరులు పాల్గొన్నారు.

**జగనన్న ప్రభుత్వమే మళ్లీ కోరుకుంటున్నారు**

**వెల్దుర్తి:** ప్రజలు జగనన్న ప్రభుత్వమే కోరుకుంటున్నారని, సంక్షేమ పథకాల లబ్ధి వివరిస్తూ గడప గడపకు వెళ్లినా, నాటి టీడీపీ ప్రభుత్వం చేసినది, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసినది వివరించి భవిష్యత్తు గురించి వాకబు చేసినా సంక్షేమ పాలన అందిస్తున్న జగనన్నను తిరిగి సీఎంగా గెలిపించుకుంటామని చెబుతున్నారని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. శుక్రవారం ప్రారంభమైన 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని రామళ్లకోటలో ఎమ్మెల్యే సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలోని తేడాలను వివరించారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా?, ఏమైనా సమస్యలు ఉన్నాయా? తదితర ప్రశ్నలు అడుగుతూ వారి సమాధానాలు ప్రజా మద్దతు పుస్తకంలో నమోదు చేసుకున్నారు. ప్రజల అనుమతితో వారి ఇంటి గోడలపై 'మా నమ్మకం నువ్వే జగనన్న' స్టిక్కర్ అతికించి, మొబైల్‌కు మరో స్టిక్కర్ అతికించి, టోల్‌ఫ్రీ నంబర్‌కు మిస్డ్‌కాల్ ఇప్పించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మన రవిరెడ్డి, నాయులు సమీర్‌కుమార్ రెడ్డి, జెడ్పీటీసీ సుంకన్న, మాధవస్వామి, రాధాకృష్ణారెడ్డి, మాలిక్ బాష, బీటీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

**జగనన్నకు సంపూర్ణ మద్దతు**

మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి ఎమ్మిగనూరు 3వ వార్డులో చంద్రకళ అనే చేనేత కార్మికురాలి గుడిసెలోకి వెళ్లి మగ్గం నేసే విధానాన్ని పరిశీలించి, సంక్షేమ పథకాల లబ్ధిపై ఆరాతీశారు. తమ కుటుంబానికి అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా, నేతన్న నేస్తం, పింఛను కానుకతో పాటు జీప్లస్ త్రీ(టిడ్కో)లో 300 చదరపు అడుగుల రూ.5.89 లక్షల విలువైన ఇల్లు మంజూరైనట్లు ఆమె సంతోషంగా చెప్పింది. సంక్షేమ పథకాల డబ్బు రూ.1,66,000 నేరుగా తన అకౌంట్లో జమ అయ్యాయని, ఇలాంటి పథకాలు కొనసాగితేనే తమ లాంటి కుటుంబాలు బాగుపడతాయని ఎమ్మెల్యేకు వివరించింది. ఇన్ని పథకాలు అందిస్తున్న జగనన్నకు సంపూర్ణ మద్దతు ఇచ్చి గెలిపించుకుంటామని నిక్కచ్చిగా తేల్చిచెప్పింది.

**జగనన్నతోనే భవిష్యత్తు**

**ఆలూరు రూరల్ (హాలహర్వి):** మండలంలో వైఎస్సార్‌సీపీ కన్వీనర్ భీమప్ప చౌదరి ఆధ్వర్యంలో ఎంపీపీ నెట్టికంఠమ్మ సమక్షంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు మొదటి రోజు 48 ఇళ్లకు వెళ్లి ఆయా కుటుంబాల వారితో మమేకమయ్యారు.గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనకు వ్యత్యాసం తెలియజేసేలా కరపత్రాలు అందించారు.

**ఆస్పరి:** మండలంలోని చిరుమాన్‌దొడ్డి గ్రామంలో ఎంపీపీ సుంకర ఉమాదేవి గృహ సారథులు, సచివాలయం కన్వీనర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రజల అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు. అలాగే ఆస్పరి, శంకరబండ, హలిగేర, బిల్లేకల్లు, ములుగుందం, నగరూరు గ్రామాలలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు.

**తుగ్గలి:** తుగ్గలిలో వైస్ ఎంపీపీ మల్లికార్జునరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షురాలు విజయలక్ష్మి, చంద్రశేఖరరెడ్డి, ఎద్దులదొడ్డిలో వైస్ ఎంపీపీ, సచివాలయ కన్వీనర్లు రాధారెడ్డి, విజయ్‌రెడ్డి, రామేశ్వరి, చిరంజీవి, బొందిమడుగులలో ఈశ్వరరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు సుంకన్న, నునుసరాల్లలో రంగారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు.

**పత్తికొండటౌన్:** పత్తికొండ గ్రామ సచివాలయం-5 పరిధి, 17, 18 వార్డుల్లోని లక్ష్మీనగర్, ఎస్‌ఆర్ నగర్ కాలనీల్లో సచివాలయ కన్వీనర్లు పల్లె ప్రతాప్‌రెడ్డి, లలితా రామచంద్రయ్య ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహించారు.

**గోనెగండ్ల:** మండలకేంద్రంలో సింగిల్‌విండో ఉపాధ్యక్షుడు భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాలు వివరిస్తూ వారి అభిప్రాయాలు నమోదు చేసుకున్నారు.

**వెల్దుర్తి:** మండల పరిధిలోని పలు సచివాలయాల పరిధిలోని కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, గ్రామ నాయకులు, ప్రజాప్రతినిధులు తమకు కేటాయించిన ఇళ్లలో కార్యక్రమం ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మన రవిరెడ్డి, జెడ్పీటీసీ సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

**హొళగుంద:** మండలంలోని ఎల్లార్తి, కోగిలతోట గ్రామాలలో సర్పంచ్‌లు కురువ చాముండేశ్వరి, ఆరుబట్ల నాగమ్మ, జెడ్పీ వైస్ చైర్మన్ కురువ బుజ్జమ్మ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం చురుగ్గా నిర్వహించారు.

**కృష్ణగిరి:** మండలంలోని అన్ని గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు జయరామిరెడ్డి, టీకేశ్వరమ్మ, ఆర్‌బీ వెంకటరాముడు, లక్ష్మీకాంతరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరించారు. సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగనన్నను ఆదరించాలని కోరారు.

## హోరాహోరీగా బండలాగుడు పోటీలు



రామళ్లకోటలో బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

**వెల్దుర్తి:** రామళ్లకోట వనం శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా, గోవర్ధనగిరి ముద్దయ్య స్వామి తిరునాలలో భాగంగా ఆయా గ్రామాలలో వివిధ విభాగాల వృషభాలకు నిర్వహించిన బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. రామళ్లకోటలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, గోవర్ధనగిరిలో కంగాటి రామ్మోహన్ రెడ్డి పోటీలను ప్రారంభించారు. రామళ్లకోట పోటీల్లో పాణ్యం మండలం కొత్తూరు బీరం సుబ్రహ్మణ్యేశ్వర రెడ్డి వృషభాలు విజేతగా నిలిచి రూ.50 వేల బహుమతిని కై వసం చేసుకున్నాయి. తర్వాతి నాలుగు స్థానాలలో రంగాపురం రామచంద్రారెడ్డి వృషభాలు, పాములపాడు తుమ్మలూరు పల్లవి వృషభాలు, వెల్దుర్తి కలుగొట్ల గొంది బజారు, ప్యాపిలి బలరాముడు వృషభాల సంయుక్త జత, రుద్రవరం ఎల్లగౌడ్ వృషభాలు నిలిచాయి. విజేతలకు ధర్మకర్తల మండలి చైర్మన్ చింతకాయల వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి మాధవస్వామి, దాతలు బహుమతులందించారు. గోవర్ధనగిరిలో జరిగిన పోటీలలో గోనెగండ్ల చిన్ననేలటూరు గాజుల కుమారస్వామి వృషభాలు విజేతలుగా నిలిచి రూ.50 వేలు గెలుచుకున్నాయి. తర్వాతి నాలుగు స్థానాలలో అనంతపురం జిల్లా మెడుమీకుల పల్లె తోట తిరుపాల్‌రెడ్డి వృషభాలు, పీఆర్ పల్లె శివకోటి, అనంతపురం రాకెట్ల లింగప్ప వృషభాల సంయుక్త జత, బేతంచెర్ల హుసేనాపురం రామసుబ్బారెడ్డి వృషభాలు, అనంతపురం గార్లదిన్నె రామాంజనేయులు వృషభాలు నిలిచి వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు గెలుచుకున్నాయి. విజేతలకు పూజారి రవికృష్ణ, నిర్వాహకులు బహుమతులందించారు.

## రసవత్తరంగా గిరకబండి పోటీలు



గిరక ఎద్ల బండి పోటీలను ప్రారంభిస్తున్న గుమ్మనూరు శ్రీనివాసులు

**నందవరం:** మండల కేంద్రంలో శ్రీగురు పంపా పతి స్వామి జాతర పురస్కరించుకుని ఎద్ల గిరకబండి లాగుడు పోటీలను వైఎస్సార్‌సీపీ నాయకులు శివారెడ్డి గౌడ్, సర్పంచ్ తోట సావి త్రి సహకారంతో మారుతి స్వామి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఆలయం ప్రాంగణంలో రసవత్తరంగా పోటీలు జరిగాయి.రైతు అంజి ఎద్లు గిరకబండిని 3,102 అడుగులు లాగి మొదటి బహుమతి రూ.5,016 కైవసం చేసుకున్నాయి. అలాగే ఉరుకుంద వృషభాలు 2,829 అడు గులు లాగి రెండో బహుమతి రూ.3,016, మూడో స్థానంలో విజయ్ ఎద్లు 2,750 అడుగు లు లాగి రూ.2,016 గెలుపొందాయి. దాతలు నాగరాజు, శ్రీను, మారుతి చేతుల మీదుగా వి జేతలకు నగదు బహుమతులను అందజేశా రు. ఆర్గనైజర్లు శరణయ్య స్వామి, నాగరాజు, నారాయణ, భక్తులు, రైతులు పాల్గొన్నారు.

**ఉత్సాహంగా గిరక బండి పోటీలు**

**ఆలూరు:** మండలంలోని హత్తిబెళగళ్ గ్రామంలో సోమేశ్వరస్వామి రథోత్సవం సందర్భంగా శుక్రవారం ఎద్ల గిరక బండి పోటీలను దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వృషభాలు మన సంస్కృతిలో భాగమని, ఎద్లు లేకపోతే వ్యవసాయం ఉండేది కాదన్నారు. గిరకబండి పోటీల్లో గెలుపొందిన వృషభాల యజమానులకు 15, 10 తులాల వెండి బహుమతులను అందజేశారు.

**ఆలూరు రూరల్:** హంపయ్య పున్నమి పురస్కరించుకుని శుక్రవారం ఆలూరులోని స్థానిక బెళ్లేగుండు ఆంజనేయ స్వామి ఆలయం ఆవరణలో గిరక బండి పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఆలూరు వృషభాలు గెలుపొందగా యజమాని పురుషోత్తంకు ఆలయ కమిటీ నిర్వాహకులు రూ.10,116 అందించారు. రెండో బహుమతి పొందిన రైతు కొడయ్యకు గ్రామస్తుడు మల్లికార్జున రూ.5,116, మూడవ బహుమతి పొందిన రైతు ఈరన్నకు హంపయ్య రూ.3,116 నగదు బహుమతి అందించారు.

### నేటి నుంచి ఫరీద్‌వలి బాబా ఉరుసు

**పత్తికొండ రూరల్:** దేవనబండ గ్రామంలో కొలువైన హజరత్ సయ్యద్‌షా ఫరీద్‌వలి బాబా ఉరుసు శనివారం నుంచి ప్రారంభం కానుంది. 8న గంధం,9న ఉరుసు,10న జియారత్‌తో వేడుకలు ముగుస్తాయి. ఉరుసు రోజున రాత్రి 9గంటలకు మాస్టర్ గోపాల్ ఆధ్వర్యంలో భక్తాదులతో చెక్కభజన కార్యక్రమం ఉంటుందని గ్రామస్తులు తెలిపారు.10న రాష్ట్రస్థాయి వృషభాల రాతిదూలం లాగే పోటీలు నిర్వహించి విజేతలకు మొదటి బహుమతి రూ.40 వేలు తర్వా స్థానాల కు రూ.30 వేలు,రూ.20వేలు,రూ.10వేలు,రూ.8వేలు,రూ.6 వేలు అందజేయనున్నట్లు నిర్వాహకులు పి.హరినాథ్‌రెడ్డి, మహబుబ్‌బాషా తెలిపారు.వివరాలకు 63016 34673, 96663 05159 నంబర్లను సంప్రదించాలన్నారు.

## సంక్షేమం, అభివృద్ధే మా విజన్



మాట్లాడుతున్న మంత్రి గుమ్మనూరు జయరాం

**ఆలూరు:** ప్రజా సంక్షేమ పాలన, అభివృద్ధే మా ప్రభుత్వ విజన్ అని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం స్పష్టం చేశారు. ఆలూరు గ్రామ సచివాలయం- 2లో ఆయన శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను క్యాలెండర్ ప్రకటించి తేదీల వారీగా అమలు చేస్తున్నారని, జనం వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారన్నారు. మాజీ సీఎం చంద్రబాబు నాయుడు కుట్రలతో 4 ఎమ్మెల్సీ స్థానాలను దక్కించుకోవడాన్ని ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. రానున్న 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మరోసారి తిరిగులేదని విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మాకు ఎవరితో పొత్తులు ఉండవని సీఎం జగన్ తేల్చి ప్రకటించినా టీడీపీ నేతలకు ఇంకా జ్ఞానోదయం కలగలేదన్నారు. టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ మ్యానిఫెస్టో, హామీలు లేకుండా ఏం పాదయాత్ర చేస్తున్నారని, అల్లర్లను రెచ్చగొట్టేలా ప్రవర్తించడం మానుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణ స్వామి, శ్రీనివాసులు, జెడ్పీటీసీ ఏరూరుశేఖర్, ఎంపీపీ రంగమ్మ, ఈరన్న, వీరేష్, భీమప్ప, రాంభీమ్‌నాయుడు తదితరులు ఉన్నారు.

## భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే



వెల్దుర్తి ఏబీఎం చర్చిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు



ఎమ్మిగనూరు సీఎస్ఐ చర్చిలో..



నాగలదిన్నెలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



పత్తికొండలో ప్రార్థనలు చేస్తున్న ఫాదర్ జోసెఫ్

**ఎమ్మిగనూరుటౌన్:** నియోజకవర్గవ్యాప్తంగా గుడ్‌ఫ్రైడే పండుగను శుక్రవారం క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక ఎంబీ చర్చితో పాటు సీఎస్ఐ చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయా చర్చిలలో పాస్టర్ రెవరెండ్ జయన్న, ఎబినేజర్ పవిత్రన్‌లు దైవ ప్రవచనాలను వివరించారు.

**ఎమ్మిగనూరురూరల్:** పట్టణంలోని ఆర్‌సీఎం చర్చి నుంచి ఫాదర్ చిన్నప్ప శిలువను మోస్తూ కోటేకల్ గ్రామ సమీపంలోని మహిమగిరి కొండ వరకు వెళ్లారు. 300 మంది క్రైస్తవులు క్రీస్తు పాటలు పాడుతూ వెంట నడిచారు. మహిమగిరి కొండ మీదకు వెళ్లి ప్రార్థనలు చేశారు. కొండపై అన్నదానం ఏర్పాటు చేశారు. గెస్ట్ ఫాదర్ రాయప్ప, సీటీసీ సిస్టర్స్ బిన్నీ అంటోని, మోనిక, మీలోని తదితరులు పాల్గొన్నారు.

**పత్తికొండటౌన్:** ఈర్ష్య, అసూయాద్వేషాలను వదలి సమాజంలోని అందరినీ ప్రేమ, దయ, క్షమాగుణాలతో ఆదరించాలని ఆర్‌సీఎం చర్చి ఫాదర్ ఎల్.జోసెఫ్ సందేశం ఇచ్చారు. పత్తికొండలో చిన్నారులు శిలువపై ఏసుక్రీస్తు నాటికను ప్రదర్శించారు. దేవుడి కుమారుడిగా ఏసుక్రీస్తు చూపిన మహత్యాలు, ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి అభియోగాలు మోపడం, రాజమందిరంలో విచారణ, శిలువపై మరణశిక్ష విధింపు ఘట్టాలను చిన్నారులు చాలా చక్కగా అందరికీ అర్థమయ్యేవిధంగా ప్రదర్శించారు.

**మద్దికెర:** మద్దికెరలో గుడ్ ఫ్రైడే సందర్భంగా [illegible] చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గ్రామ పురవీధుల గుండా ఏసు శిలువ మోస్తున్నట్లుగా ఊరేగింపు నిర్వహించారు. అలాగే ప్రధాన కూడళ్లలో ప్రత్యేక ప్రార్థనలు, గీతాలు ఆలపిస్తూ ఊరేగింపు చేశారు.

**వెల్దుర్తి:** మండల వ్యాప్తంగా క్రైస్తవులు శుక్రవారం గుడ్‌ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉపవాస దీక్షలతో చర్చిలలో ప్రార్థనలతో గడిపారు. కీర్తనలు సాగాయి. స్థానిక ఏబీఎం చర్చిలో పాస్టర్ ఏసేపు బోధిస్తూ శిలువపై క్రీస్తు చెప్పిన ఏడు మంచి మాటలను వినిపించారు. బొమ్మిరెడ్డిపల్లె ఏబీఎం చర్చిలో రెవరెండ్ టిఏ దేవదాసు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంఘ పెద్దలు, సంఘస్తులు పాల్గొన్నారు.

**హొళగుంద:** మండలంలో హొళగుంద, గజ్జహళ్లి, ఎల్లార్తి, హొన్నూరు కొట్టాల, హెబ్బటం, మార్లమడికి తదితర గ్రామాల్లో క్రిస్టియన్లు వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. హొళగుందలోని పెనుయేలు చర్చిలో పాస్టర్ క్రిష్టియన్‌లకు ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. మంచి మార్గంలో నడవాలని సందేశమిచ్చారు. బైబిల్‌లోని అంశాలను చదివి వినిపించారు.



ఆలయం ముందు కోలన్న నృత్యాలు చేస్తున్న చిన్నారులు

## వైభవంగా లంకాదహన కార్యక్రమం

**హొళగుంద:** గజ్జహళ్లి గ్రామంలో పోతులింగేశ్వర స్వామి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి లంకాదహన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొ క్కులు తీర్చుకున్నారు.పూజారులు ఆలయంలో ప్రత్యే క పూజలు చేసి స్వామి వారి విగ్రహాన్ని పల్లకిలో ఉంచి ఊరేగింపు జరిపారు. అనంతరం ఆలయ నిర్వాహకులు, గ్రామపెద్దల ఆధ్వర్యంలో రకరకాల బాణాసంచా కాల్చారు. భక్తులు దాదాపు గంటన్నర పాటు సంభ్రమాశ్చర్యాలతో కార్యక్రమాన్ని తిలకించారు. శనివారం వసంతోత్సవంతో ఉత్సవాలు ముగియనున్నాయి.

# విజృంభిస్తున్న విషజ్వరాలు

- ఆస్పత్రులకు క్యూ కడుతున్న రోగులు
- ఆలూరు సీహెచ్‌సీ పరిధిలో వారం రోజుల్లో 1,531కు చేరిన ఓపీ
- జ్వరం, వాంతులు, విరేచనాలతో వస్తున్న వారిలో చిన్నపిల్లలు, వృద్ధులే అధికం
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు




ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

**ఆలూరు రూరల్:** గత వారం రోజుల నుంచి ప్రబలుతున్న విషజ్వరాలు, వాంతులు, విరేచనాలతో ఆలూరు ప్రజలు ఆస్పత్రికి రోగులు క్యూ కడుతున్నారు. గత పది రోజులుగా ఎండ తీవ్రత అధికం కావడంతో వృద్ధులు, చిన్న పిల్లలు అనారోగ్యం బారిన పడుతున్నారు. తీవ్రమైన జ్వరం, వాంతులు, విరేచనాలు, వడదెబ్బకు గురైన వారే అధికంగా ఆస్పత్రికి వస్తున్నట్లు వైద్యులు వెల్లడిస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు పాటించాలని డాక్టర్లు సూచిస్తున్నారు. ఎప్పటికప్పుడు వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. మసాలా ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు.

**వారంలో 1,531కు చేరిన ఓపీ**

ఆలూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో వారం రోజుల నుంచి శుక్రవారం నాటికి సాధారణ ఓపీ సంఖ్య 1,531కు చేరింది. వారం క్రితం సాధారణ రోగుల ఓపీ 30 నుంచి 40 వరకు ఉండేది. ఈ నెల 28వ తేదీన శుక్రవారం వరకు రోజుకు 200 మంది రోగులు ఆస్పత్రికి రాగా 80 మందికి రోగులకు పైగా ఆస్పత్రిలో అడ్మిట్ చేసుసుకుని చికిత్స అందించారు. ఇందులో 700 మంది జ్వరం, వాంతులు, విరేచనాలతో బాధపడుతూ ఆస్పత్రికి వచ్చారు. అందులో 300 మంది రోగులకు 24 గంటల పాటు ఆస్పత్రిలో ఉంచుకుని చికిత్స అందించినట్లు వైద్యులు చెబుతున్నారు. ఆస్పత్రికి వచ్చిన వారిలో ఎండల తీవ్రత వల్ల అస్వస్థతకు గురైన వారు.. కూలీ పనిచేసే కార్మికులు, జ్వరం, వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న చిన్న పిల్లలు, వృద్ధులు అధికంగా ఉన్నట్లు చెప్పారు. దీంతో పాటు ఆలూరు నియోజకవర్గంలోని 11 పీహెచ్‌సీలలో రోజురోజుకు ఓపీ పెరుగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో అధికంగా విషజ్వరాలతో బాధపడుతున్న రోగులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

**అప్రమత్తంగా ఉండాలి**



వేసవి కావడంతో ఎండల తీవ్రత ఎక్కువైంది. వాతావరణ మార్పులు, కలుషిత ఆహారం, తాగునీటి వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయి. గత మూడు రోజులుగా ఎక్కువ శాతం మంది జ్వరం, వాంతులు, విరేచనాలు, వడదెబ్బకు గురైన వారు అధికంగా ఆస్పత్రిలో చేరుతున్నారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉండడంతో వారికి ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకుని, 24 గంటలు అబ్జర్వేషన్‌లో ఉంచి చికిత్స అందిస్తున్నాం. వృద్ధులు, చిన్నారులు రోజుకు 5 లీటర్ల మంచి నీరు తాగాలి. ఉదయం 11 నుంచి 4 గంటల వరకు బయటకు వెళ్లకపోవడం మంచిది.

– లక్ష్మీనారాయణ, డాక్టర్, ఆలూరు సీహెచ్‌సీ

### నేడు సాయిబన్నదాదా ఉరుసు

**హొళగుంద:** మండల కేంద్రంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న సాయిబన్నదాదా ఉరుసు ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు దర్గా నిర్వాహకులు తెలిపారు. 8న గంధం, 9న ఉరుసు, 10న జియారత్ కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయని వెల్లడించారు. హొళగుందలోని మంచద మనె(దేవుని ఇల్లు)గా పిలిచే పూజారుల ఇంటి నుంచి ఊరేగింపుగా వచ్చే గంధానికి ఉరుసులో ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. గంధం తీసుకొచ్చే సమయంలో భక్తులు ప్రదర్శించే కర్రసాము, బల ప్రదర్శనలు అమితంగా ఆకట్టుకుంటాయి.

### పేకాట స్థావరంపై దాడి

**కృష్ణగిరి:** మండల పరిధిలోని ఆగవేళి గ్రామ శివారులో మాదిగ కౌలుట్ల పొలంలో వేప చెట్టు కింద పేకాట ఆడుతున్న వారిపై శుక్రవారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో దేవనకొండ మండలం పి.కోట కొండకు చెందిన మాదిగ దస్తగిరి, బండారి మోష, సింగాపురం తిరుపతయ్య, బోయ లక్ష్మన్న, గుమ్మరాళ్లకు చెందిన మాదిగ శివన్న, చెవిటన్నలను అరెస్టు చేసి వీరివద్ద నుంచి రూ.7,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.